అందుకే అద్దంలోంచే ఆధారులోని నల్లటి అక్షరాలు అలుక్కుపోయినట్లు కనబడ్డా వాటిని యధాతథంగా చదివినట్లు నటించగలిగాడు.

గర్వంగా హాస్పిటల్ సూపరింటెండెంట్ గదివైపు నడిచాడు శామ్యూల్ ఓ సారి జేబులోని కళ్ళజోడుని తడుముకుని.

# రాబడి

ప్రకాష్‌నగర్‌లో గోకుల్ ఇల్లు వెదకటం పెద్ద కష్టం కాలేదు. సికింద్రాబాద్ స్టేషన్ నుంచి ముఫైనాలుగో నంబరు బస్ఎక్కి కండక్టర్‌తో చెప్పాను ఏర్ ఫోర్స్ బస్‌స్టాప్ రాగానే చెప్పమని.

దిగి, ప్రకాష్‌నగర్‌లోని గోకుల్ ఇంటికి పావుగంటలో చేరుకున్నాను. ఇంటి నంబరుని బట్టి. పోస్టాఫీసు సందులో తిన్నగా వెళ్ళితే కుడివైపు మూడో సందులోని ఇల్లే

గోకుల్ భార్య తలుపు తెరచింది.

"మీరా, రండి ఏ బండిలో వచ్చారు?" అడిగింది సంతోషంగా.

లోపలికి నడిచాను. గోకుల్ మంచం కోడుకి చిన్న అద్దం ఆనించి గడ్డం గీచుకుంటున్నాడు. నన్ను చూడగానే సంతోషం వెల్లివిరిసింది.

చెల్లాయ్ పెళ్ళిసంబంధం ఖాయం చేసుకోడానికి వచ్చానని చెప్పగానే గోకుల్ భార్య అడిగింది నన్ను—

"మీ పెళ్ళెప్పుడయితే?"

"ఘడియ రావాలి" అన్నాను నవ్వి.

"మరో వారంపాటు ఆఫీస్‌కి వెళ్ళనక్కరలేదు నేను హాయిగా కబుర్లు చెప్పుకుందాం. సినిమాలు చూద్దాం" అన్నాడు గోకుల్.

స్నానం, భోజనం ముగించాక అన్నాడు గోకుల్ బయటకెళుతూ,

"ఓసారి డాక్టర్ దగ్గరకి వెళ్ళిరావాలి. గంటలో వస్తానుండు."

"దేనికీ డాక్టరు దగ్గరికి?" అడిగాను గోకుల్ భార్యని, వాడు గబ కబా వెళ్ళిపోవటంతో.

ఆవిడ నా ప్రశ్న వినపడనట్టుగా కొడుకు, కూతురు విడిచిన బట్టలు ఉతకడానికి స్నానాల గదిలోకి వెళ్ళిపోయింది. ప్రయాణాలప్పుడు నే తీసు కొచ్చే పుస్తకాల్లో ఒకటి తీసాను.

గోకుల్ టేబిల్ మీద ఓ కాగితం నా దృష్టిలో పడింది. అది ఎగిరి పోకుండా ఓ పెద్ద గవ్వ దాని మీద ఉంచి వుంది. ముందర గవ్వ చూసాక ఆ కాగితాన్ని చూశాను.

సర్టిఫికేట్ అది!

గోకుల్‌కి వేసెక్టమీ అపరేషను చేసినట్లుగా గవర్నమెంటు డాక్టరు వ్రాసిచ్చిన సర్టిఫికెట్ అది!!

గోకుల్‌కి పిచ్చెక్కిందా అనిపించింది నాకా సర్టిఫికెట్ చూడగానే ఇద్దరు పిల్లలలో ఒకరు ముత్యం, ఒకరురత్నం, గోకుల్ భార్యకి రెండో కాన్పులో ముత్యం లాంటి ఆడపిల్ల పుట్టగానే ట్యూబెక్టమీ అపరేషన్ చేయించేశాడు మూడు సంవత్సరాల క్రితం విశాఖపట్నంలోనే.

మళ్ళీ తనెందుకు వేసక్టమీ అపరేషన్ చేయించుకున్నట్లు? గోకుల్ తిరిగి వచ్చేదాకా నాకు ఆలోచనలు పరిపరివిధాల పోయాయి. గోకుల్ భార్యని ఆ విషయం అడిగే చొరవ లేదు నాకు.

తిరిగి రాగానే అడిగాను ఆ సంగతి.

"అవును చేయించుకున్నాను. డాక్టరు దగ్గరికి వెళ్ళి కట్టు మార్పించు కుని వస్తున్నాను" అన్నాడు నవ్వి.

"ఎవరైనా పెళ్ళికాని అమ్మాయితో ప్రేమలో పడ్డావా?" నా అను మానాన్ని వెలికక్కాను. "అందుకని జాగ్రత్తకోసం...."

"ఛీ, నీవన్నీ వెధవాలోచనలే"

"పోనీ నీవు చేసిన ఈ మంచి పని ఎందుకు చేశావో చెప్పు. మీ ఆవిడకి చేసిన ఆపరేషన్ ఫెయిల్ అయి మళ్ళీ నెలతప్పిందా"

"ఊహూ"

"మరయితే ఎందుకీ అనవసరపు శస్త్రచికిత్స?"

"రాబడి కోసం"

"ఎగ్జాట్లీ"

"ఎలా"

"నేను పనిచేసేది స్టేట్ గవర్నమెంటులో అవునా?"

"అవును"

"ఆ మధ్య ఓ రూలు వచ్చింది. ఇద్దరు పిల్లలు పుట్టిన తర్వాత వేసెక్టమీ చేయించుకున్న ప్రతీ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగికీ రెండు ఇంక్రిమెంట్స్ ఇన్సెంటివ్‌గా ఇస్తున్నారు. మా ఆవిడకి ఇదివరకెప్పుడో ఆపరేషన్ చేయించడం వల్ల ఇప్పుడా యింక్రిమెంట్స్ రావు. కాబట్టి ఆ రెండు ఇంక్రిమెంట్స్ కోసం, అంటే దాదాపు నెలకి పాతికరూపాయల ఎక్కువ జీతం కోసం నేను కావాలని వేసక్టమీ చేయించుకున్నాను. డాక్టరు ఇచ్చిన సర్టిఫికెట్ సబ్‌మిట్ చేస్తే నాకు ఇంక్రిమెంట్ ప్లస్ హాస్పిటల్లో ఈ ఆపరేషన్ చేయించుకున్నందుకు అవార్డ్ ప్లస్ స్పెషల్ లీవ్."

తెల్లబోయాను,

"బావున్నా?" అడిగాడు నవ్వుతూ.